పోలీసు సేవలపై 'ఓపెన్‌హౌస్'

ఇంద్రవెల్లి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా పోలీసు సేవలపై అవగాహన కల్పించేందుకే ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నట్లు ఉట్నూర్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో జెడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు పోలీసు సేవలపై ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసు శాఖ అందిస్తున్న సేవలు, చట్టాల గురించి వివరించారు. వివిధ రకాల ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు, దొంగతనల, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై దుబ్బక సునీల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్నూర్: శాంతియుత సమాజమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారని సీఐ రహీంపాషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఓపెన్ హౌజ్ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల ఆయుధాలపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. అనంతరం విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాల పనితీరు, స్టేషన్ నిర్వహణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగారెడ్డి, ఏఆర్ ఎస్సై జాదవ్ కాంతరావు, పోలీసు సిబ్బంది నరేశ్, నరేందర్, నాగోరావు, జైవంతరావు పాల్గొన్నారు.

తలమడుగు: వివిధ సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీస్ స్టేషన్‌లో జరిగే కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై అంజమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు వస్తే ఎలా ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఎఫ్ఆర్ ఐ ఎలా నమోదు చేస్తారు. ఆయుధాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్‌రావు, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అంజమ్మ


ఆయుధాల పనితీరును వివరిస్తున్న సీఐ రహీంపాషా


అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

పోలీసు అమరవీరుల వారోత్సవాలు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు అమరవీరుల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో పోలీసుల అమరవీరుల స్థూపాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయం సైతం విద్యుత్ కాంతులతో విరజిమ్ముతోంది. బుధవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌజ్ నిర్వహించారు. పోలీసు అధికారులు వినియోగించే ఏకే–47, 9 ఎంఎల్ పిస్టోల్, ఇతర ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బంది విధుల గురించి తెలియజేశారు. రిసెప్షన్ గది, ఖైదీల నుంచే లాకప్, ఎస్‌హెచ్‌వో గది, కోర్టు రికార్డులను భద్రపర్చే గదులను చూపించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సై విష్ణుప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ మదన్, ఆశన్న, సిబ్బంది నరేందర్, ప్రవీణ్, సుధాకర్ రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.


ఆయుధాల గురించి వివరిస్తున్న టూటౌన్ సీఐ

అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆదివాసీలు బుధవారం నిరసన చేపట్టారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని పిప్పల్‌ధరి గ్రామపంచాయతీ పరిధిలోని దహిగూడకు చెందిన కుమ్ర లక్ష్మీబాయిపై అటవీశాఖ అధికారులు దాడి చేయడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వంటచెరుకు కోసం తన ఇద్దరు పిల్లలతో కలిసి అడవికి వెళ్లిన లక్ష్మీబాయితో పాటు ఆమె పిల్లలపై అటవీ శాఖాధికారి చేయి చేసుకున్నారని మండిపడ్డారు. అటవీపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీలపై అటవీ శాఖ అధికారులు దాడి చేయడం సరికాదన్నారు. తడకలు, తేనే, అటవీ ఉత్పత్తులతో జీవనం సాగిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీల సంఘాల నాయకులు కుమ్ర జంగుపటేల్, సోనేరావు, లక్ష్మీబాయి, దిలీప్, దేవిదాస్, రోహిదాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న ఆదివాసీ నాయకులు

మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని బీసీ అభివృద్ధి శాఖ పరిధిలోని అన్ని వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బీసీ పోస్టుమెట్రిక్ (బాలుర) వసతి గృహంలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, హెచ్‌డబ్ల్యూవో శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజలింగు

'కేటీఆర్ క్షమాపణ చెప్పాలి'

ఆదిలాబాద్‌రూరల్: పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధిని పట్టించుకోని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జిల్లా పర్యటనకు వచ్చే ముందు ప్రజలకు, నిరుద్యోగులకు, రైతులకు క్షమాపణ చెప్పాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం మావల మండలంలోని వాఘాపూర్‌లో మాట్లాడారు. పెన్‌గంగ రిజర్వాయర్‌పై కుర్చీ వేసుకొని పనులు పూర్తిచేయిస్తానని గతంలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. మాయమాటలు చెప్పి రెండు సార్లు అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. రైతులకు బేడీలు వేసి జైలులో వేసిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు

కైలాస్‌నగర్: రైతు సమస్యలపై ధర్నా చేసే నైతిక హక్కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల కాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం సోయా కేవలం ఆరు క్వింటాళ్లు కొనుగోలు చేయగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పది క్వింటాళ్లు కొనుగోలు చేసేలా జీవో జారీ చేశారని అన్నారు. రైతుల గురించి, రైతు సమస్యలపై మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

తలమడుగు: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని విద్యుత్ శాఖ ఎస్సీ చౌహన్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో బదిలీపై వెళ్లిన విద్యుత్ ఏఈ సతీష్‌ని ఘనంగా సన్మానించారు. మండల వాసులకు గత ఆరేళ్లుగా సేవలందించారని, ఏ చిన్న విద్యుత్ సమస్య వచ్చిన వెంటనే పరిష్కరించాడని కొనియాడారు. ఇలాంటి అధికారి బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. అలాగే కొత్తగా బదిలీపై వచ్చిన ఏఈ శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, రమేశ్‌రెడ్డి, బాబాన్న, ప్రకాష్‌రావు, కమలాకర్, మహేందర్ యాదవ్, ఆశన్న యాదవ్, వెంకన్న యాదవ్, ప్రకాష్ పాల్గొన్నారు.


ఏఈ సతీష్‌ను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: శబరిమాత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని మల్యాల్ గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న రామ కోటి ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో శబరిమాత ఆశ్రమం నిర్మాణం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భారతనంద సరస్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన

ఇంద్రవెల్లి: మండలంలోని తెజాపూర్, ధర్మసాగర్ గ్రామాల్లో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ సేవలపై రైతులకు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. అకౌంటెంట్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, జనరల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి

ఆదిలాబాద్‌రూరల్: కుష్టు వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్ రావు, రమేశ్‌లు అన్నారు. బుధవారం మావల మండలంలోని వాఘాపూర్ కోలాంగూడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో కుష్టు వ్యాధికి చికిత్స పొందుతున్న రోగికి, వారి కుటుంబ సభ్యులను వైద్య పరీక్షలు నిర్వహించారు. చికిత్స పూర్తయ్యే వరకు ఆశ కార్యకర్త నెలకొసారి రోగి ఇంటిని సందర్శించి పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో వాఘాపూర్ ఉప కేంద్రం సీహెచ్‌వో రోజా, రమణి, ఆరోగ్య పర్యవేక్షకులు సుభాష్, శకుంతల, ఆరోగ్య కార్యకర్త పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

తాంసి: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నానాటి మిత్రుడికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందించారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కె.రాజు గుండెనొప్పితో గత కొంత కాలంగా బాధపడుతున్నాడు. బాధితుడికి వైద్య చికిత్స కోసం కప్పర్ల పాఠశాలలో 1990లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం చేశారు. బుధవారం గ్రామానికి వెళ్లి రూ.10 వేల నగదు తక్షణం అందజేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు. పూర్వవిద్యార్థులు గంగాధర్ రెడ్డి, మునీర్‌ఖాన్, భూపతి, గంగాధర్, గంగన్న, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వివేకానందుడి బాటలో నడవాలి

ఆదిలాబాద్‌టౌన్: యువత వివేకానందుడు చూపిన బాటలో నడవాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో యువజన సంఘాల నాయకులు డీఎస్పీని కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈనెల 26న జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బాల శంకర్‌కృష్ణ, గణేష్, అర్బాత్ ఖాన్, సత్యం, ప్రమోద్, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

పాలకవర్గాన్ని నియమించాలి

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల ముందు గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కల్లు గీత కార్మికుల గీత కార్పొరేషన్‌కు పాలక మండలిని ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని గౌడజన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో నిర్వహించారు. జిల్లాలోని కొందరు అబ్కారి సీఐ, ఎస్సైలు, కానిస్టేబుళ్లు గీత కార్మికులను మాముళ్ల కోసం వేధిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు నారాయణ గౌడ్, రంగు శ్రీనివాస్ గౌడ్, రంగు నాగరాజ్ గౌడ్, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

ఎదులాపురం: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రుక్మిణిగార్డెన్‌లో ఈనెల 25న నిర్వహిస్తున్న సీపీఎం ఆదిలాబాద్ రూరల్ మండల 7వ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లంకా రాఘవులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూ నిర్వాసితులకు రూ.25 లక్షల నష్ట పరిహారం, సాత్నాల ఎడమ కాలువ నుంచి పంట భూములకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం తీర్మానాలు చేయడం, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని సమస్యల పై చర్చించి భవిష్యత్ పోరాట రూపాకల్పన రూపొందించడం జరుగుతుందన్నారు. ఇందులో మండల కార్యదర్శి స్వామి, నాయకులు ఆశన్న, విష్ణు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లంకా రాఘవులు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

నార్నూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంఈవో పవార్ అనిత అన్నారు. బుధవారం మండలంలోని సుంగాపూర్ గొండుగూడ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యానందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. పాటించని వారి బిల్లులు నిలిపి వేస్తామన్నారు.


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

సమస్య పరిష్కారానికి చర్యలు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణానికి మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వాటర్‌గ్రిడ్ ఈఈ గోపిచంద్ అన్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు బుధవారం పలువురు కౌన్సిలర్లతో కలిసి జిల్లా కేంద్రంలోని ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పైపులైన్ మరమ్మతులు, వాల్ రిపేర్ల పనులను పరిశీలించారు. నీటి సమస్య తలెత్తడానికి గల కారణాలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని పరిష్కరించి సమస్యను నివారించేలా చూస్తామన్నారు. డీఈ తిరుపతి, కౌన్సిలర్ బండారి సతీష్, తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న అధికారులు

సరిహద్దు రాళ్ల తొలగింపు


రాళ్లతొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని అక్రమ లేఅవుట్లపై బల్దియా అధికారులు ఎట్టకేలకు దృష్టి సారించారు. పట్టణంలోని భాగ్యనగర్, చిల్కూరి లక్ష్మీనగర్ కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లపై చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ బుధవారం బల్దియా సిబ్బందితో కలిసి ఆయా లేఅవుట్ల వద్దకు చేరుకున్నారు. పకడ్బందీ పోలీస్ బందోబస్తు నడుమ జేసీబీ యంత్రాల సాయంతో లేఅవుట్లలో పాతిన బండరాళ్లను తొలగించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహాన్ అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ద్వారా మెనిఫెస్టోలో ప్రకటించిన డీఏ, పీఆర్సీ పెండింగ్ బిల్లులు పరిష్కారం అవుతాయన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆరోపించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ, గంగాధర్, జాదవ్ రాజ్‌కుమార్, సురేశ్, గోమంత్ రెడ్డి, జీజుబాయి, ఉపేందర్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న రూపేష్ రెడ్డి

కైలాస్‌నగర్: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో బీటీ రోడ్డు పనులు చేపట్టాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో కార్యాలయంలో పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీడీఏ ద్వారా మంజూరైన బీటీ రోడ్డు పనులు ఇంకా మొదలు పెట్టలేదన్నారు. కాంట్రాక్టర్లు రోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనుముల ఉదయ్ కుమార్, సంతోష్, భీమ్‌రావు, దశరథ్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన వద్దు

ఇంద్రవెల్లి: సెల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైనా ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోగొట్టుకున్న నాలుగు సెల్ ఫోన్లను సంబంధిత వ్యక్తులకు అప్పగించారు. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుంటే పోగొట్టుకున్న ఫోన్‌ను స్వాధీనం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బక సునీల్, తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రేడ్ రిబ్బన్ క్లబ్ క్విజ్ పోటీల్లో జిల్లాకు చెందిన టీజీడబ్ల్యూఆర్‌జేసీ బాలికలు మూడో స్థానంలో నిలిచారని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ లలితా కుమారి తెలిపారు. ఈ పోటీల్లో పది జిల్లాలకు చెందిన విద్యార్థులు పాల్గొనడం జరిగిందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని బి. సమీక్ష, తొమ్మిదో తరగతి చదువుతున్న అక్షయలు మూడో స్థానం నిలిచారని పేర్కొన్నారు.

జీవో 29ను రద్దు చేయాలి

ఉట్నూర్‌రూరల్: గ్రూప్ 1 పరీక్షలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని బీఎస్పీ ఖానాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు కాటం ప్రభాకర్ అన్నారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. జీవో నెంబర్ 29 ప్రకారం ఓపెన్ కేటగిరిలో రిజర్వేషన్ అభ్యర్థికి ఉన్నత మార్కులు వచ్చినప్పటికీ జనరల్‌లో తీసుకోవడం లేదన్నారు. దీని వల్ల మరో రిజర్వుడు అభ్యర్థికి చాన్స్ ఉండదన్నారు. ప్రభుత్వం పునరాలోచించి జీవో నెంబర్ 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో యాభైఏళ్లు వెనక్కి

ఎదులాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం, కేసీఆర్ కుటుంబ పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో యాభై సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముదుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఐటీరంగం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, భూ, ఇసుక, లిక్కర్ కుంభకోణం పేరిట రూ. లక్షల కోట్ల అవినీతి జరిగిందన్నారు. నాయకులు బుర్రి సత్యాజి, కృష్ణయ్య, నర్సింగ్‌రావు, రమేశ్, గణేశ్, రాందాస్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఎదులాపురం: పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా పూర్వ అధ్యక్షురాలు కళావతి, ప్రస్తుత జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరీష్, గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో మాట్లాడారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆటోటోరియంలో ఈనెల 24న స్వర్ణోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సారిక, నికిత, ప్రీతి, భాగ్యశ్రీ, రజిత, గిరిజ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

30 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

ఇచ్చోడ: ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈనెల 30 వరకు గడువు ఉందని కోఆర్డినేటర్ సురేశ్‌జోషి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రాథోడ్ సంతోష్‌లు తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ పాఠశాలలో మాట్లాడారు. ఓపెన్ స్కూల్‌లో చేరే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 91821 61664 సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీగా గెలిపించాలి

తాంసి: ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పీఆర్టీయూ అభ్యర్థి వంగా మహేందర్ రెడ్డిని గెలిపించాలని పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి తుల శ్రీనివాస్ కోరారు. బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండలంలోని గోట్కూరి, కప్పర్ల పాఠశాలలో పలువురు ఉపాధ్యాయుల ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దండు శ్రీనివాస్, ప్రవీణ్, ఆనంద్, సంతోశ్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

బోథ్: మండలంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన జి. సంగీతను మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. నాయకులు ఎలుక రాజు, ప్రభాకర్, లక్ష్మణ్, మునేశ్వర్, సోమన్న, భీంరావ్, రమణయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి కొలాంగూడలో జరగనున్న కుమురం సూరు వర్ధంతి పోస్టర్‌ను వర్ధంతి కమిటీ నాయకులు బుధవారం ప్రెస్‌భవన్‌లో ఆవిష్కరించారు. శుక్రవారం నిర్వహించే వర్ధంతిని విజయవంతం చేయాలని కమిటీ చైర్మన్ టేకం భీంరావు, నిర్వాహణ కమిటీ కన్వీనర్ కుమ్ర రాజు, సూరు వారసుడు కుమురం లేతులు కోరారు. ప్రతినిధులు, ఉద్యోగులు, ఆదివాసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొడప లక్ష్మణ్, ఆత్రం శ్రీను, ఆత్రం దినేశ్, మడావి మహేశ్, రామ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలని పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేయనున్న పడాల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 వరకు గడువు ఉందన్నారు. తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో నమోదు పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని అడేగామ(కె)లో బుధవారం పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు.

కనీస వేతనాలు చెల్లించాలి

బోథ్: బీడీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీడీ కార్మిక సంఘం జిల్లా రెండో మహా సభలు నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాయకులు విలాస్, గోవర్ధన్, సిర్ర దేవేందర్, రాజు, గోదావరి పాల్గొన్నారు.